

భూమాతకు జ్వరం!.. ప్రమాదకర స్థాయికి ఏడు కీలక సూచికలు

నిప్పులాంటి నిజాల ప్రతిబింబం

నిలువుటద్దం

విలేకరులు కావలెను...

సంచలన దినపత్రిక నిలువుటద్దం కు – తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాల వారీగా, మండలాల వారీగా పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9059548848

హైదరాబాద్. ఎడిటర్:- వై. రమ నాగరాజు సంపుటి:-32 సంచిక:-233 శనివారం 17-10-2026

సీఎం రేవంత్ ఆదేశాల అమలు..

విద్యుత్ శాఖలో ఉన్నతాధికారి సస్పెన్షన్

- యాదాద్రి థర్మల్ ప్లాంట్ చీఫ్ ఇంజినీర్ బి.సురేశ్ సస్పెన్షన్
- విధుల్లో నిర్లక్ష్యమే చర్యలకు కారణమని టీజీ జెన్‌కో ఉత్తర్వులు
- విద్యుదుత్పత్తి పెంపు పనుల్లో పర్యవేక్షణ లోపాలున్నట్లు ఆరోపణ
- విద్యుత్ కోతలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి
- ఉన్నతాధికారులపైనా చర్యలు తప్పవని సీఎం హెచ్చరిక

2లో

ప్రజలు, అధికారులు సీఎం పదవికి ముప్పుగా మారొచ్చని హెచ్చరిక

తెలంగాణలో విద్యుత్ కోతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన గంటల వ్యవధిలోనే ప్రభుత్వం చర్యలకు దిగింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్-1 చీఫ్ ఇంజినీర్ బి. సురేశ్‌ను సస్పెండ్ చేసింది. టీజీ జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్.హరీశ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుదుత్పత్తి పెంపునకు ప్రాధాన్య పనుల ప్రణాళిక, పర్యవేక్షణ, అమలులో ఆయన తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగనుంది. బుధవారం సాయంత్రం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విద్యుత్ కోతలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నైనీ, మహానది బొగ్గు బ్లాకుల నుంచి బొగ్గు సరఫరా ఉన్నప్పటికీ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తి ఎందుకు

కరెంట్ కోతలకు మీ వైఫల్యమే కారణం

రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్!

- బొగ్గు నిల్వలు, సమీక్షల్లో నిర్లక్ష్యం జరిగిందని విమర్శ
- ఎల్‌నినో హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపణ
- అధికారులపై నెపం నెడుతున్నారని సీఎం తీరుపై విమర్శ
- నిషేధిత భూముల వ్యవహారాన్ని ప్రస్తావించిన హరీశ్ రావు
- ప్రజలు, అధికారులు సీఎం పదవికి ముప్పుగా మారొచ్చని హెచ్చరిక

తెలంగాణలో విద్యుత్ సంక్షోభంపై రాజకీయ దుమారం మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, - మిగతా 2 లో

సింగరేణి ప్రైవేటీకరణపై

మంత్రి కీలక ప్రకటన

- సింగరేణిని ప్రైవేటీకరించబోమని శ్రీధర్‌బాబు స్పష్టీకరణ
- ప్రైవేటీకరణపై విపక్షాల ఆరోపణల్లో నిజం లేదని వెల్లడి
- గత బీఆర్‌ఎస్ పాలనపై మంత్రి తీవ్ర విమర్శలు
- సింగరేణికి భారీగా బకాయిలు పెట్టారని ఆరోపణ
- ఆధారాలు లేని విమర్శలను పట్టించుకోవద్దని కార్మికులకు సూచన

సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని - మిగతా 2 లో

గడ్డంతో న్యూ లుక్

అసలు కారణం చెప్పిన కేటీఆర్

- కొత్త గడ్డం లుక్‌తో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచిన కేటీఆర్
- రామగుండం పర్యటన నేపథ్యంలోనే ఈ మార్పు అని వెల్లడి
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కేటీఆర్ ఫొటోలు, వీడియోలు
- కేటీఆర్ లుక్‌ను 'మాస్' అంటూ ప్రశంసిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు
- 'ఆ మాత్రం ఉండాలి' అంటూ గడ్డంపై కేటీఆర్ సరదా వ్యాఖ్య

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తన సరికొత్త లుక్‌తో అందరినీ ఆశ్చర్యపరిచారు. ఎప్పుడూ క్లీన్ షేవ్‌తో కనిపించే ఆయన, ఈసారి గడ్డంతో దర్శనమివ్వడం రాజకీయ వర్గాల్లో, సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఆయన కొత్త లుక్‌కు సంబంధించిన ఫొటోలు, - మిగతా 2 లో

నౌకలోని 21 మంది సిబ్బంది సురక్షితంగా గట్టెక్కారు

- హర్మూజ్ జలసంధిలో నౌక మునక.. సముద్రంలో తేలియాడుతున్న ఐఫోన్లు, పెర్ఫ్యూమ్‌లు
- హర్మూజ్ జలసంధిలో మునిగిపోయిన యూఏఈ కార్గో నౌక
- సముద్రంలో తేలియాడుతున్న ఐఫోన్లు, లగ్జరీ పెర్ఫ్యూమ్‌లు
- మైన్ వల్లే ప్రమాదం అన్న ఇరాన్, దాడి జరిగిందన్న అధికారులు
- ప్రాంతంలో పెరుగుతున్న వాణిజ్య నౌకలపై దాడుల ఘటనలు

హర్మూజ్ జలసంధిలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల మధ్య యూఏఈకి చెందిన ఒక భారీ - మిగతా 2 లో

పాకిస్థాన్‌లో తీవ్ర విషాదం.. స్కూల్ పైకప్పు కూలి 29 మంది మృతి

- పెషావర్‌లో కూలిన స్కూల్ పైకప్పు
- ఘటనలో 28 మంది చిన్నారులు, ఒక టీచర్ మృతి
- 40 మందికి పైగా విద్యార్థులకు తీవ్ర గాయాలు
- పాఠశాల యజమానిని అరెస్ట్ చేసిన పోలీసులు
- ఘటనపై దర్యాప్తునకు ఆదేశించిన అధికారులు - మిగతా 2 లో

అలాంటి వాళ్లను కాల్చి చంపాలి

ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

- సైనిక రహస్యాలు లీక్ చేసేవారిని కాల్చి చంపాలన్న ట్రంప్
- ఇరాన్‌పై దాడి వివరాలు మీడియాకు లీకయ్యాయని ఆరోపణ
- లీకేజీతో సైనిక చర్య సమయం మార్చినట్లు వెల్లడి
- రెండు రోజుల తర్వాత దాడి నిర్వహించినట్లు ట్రంప్ ప్రకటన
- లీకేజీకి పాల్పడిన వ్యక్తి వివరాలు వెల్లడించని అధ్యక్షుడు

2లో

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సైనిక రహస్యాలను బయటపెట్టే వారిని కాల్చి చంపాలని అన్నారు. ఇరాన్‌పై దాడికి సంబంధించిన కీలక సమాచారం మీడియాకు లీక్ కావడంతో

నైజీరియాలో ఐఎస్

ఉగ్రవాదుల బీభత్సం

- సైనిక స్థావరంపై దాడిలో 20 మంది మృతి
- దాడిలో ఐదుగురు పౌర సేన సభ్యులు కూడా మృతి
- ఆయుధాలు దోచుకుని బేస్ క్యాంపును తగలబెట్టిన ఉగ్రవాదులు
- నైజీరియాలో మూడు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా పెరిగిన హింస - మిగతా 2 లో

భారత్‌లో పెరుగుతున్న వృద్ధులు మారుతున్న ఉద్యోగ సమీకరణాలు

- భారత్‌లో భారీగా పెరుగుతున్న వృద్ధుల జనాభా
- 2050 నాటికి 20 శాతానికి పైగా చేరనున్న సీనియర్ సిటిజన్లు
- రిటైర్మెంట్ తర్వాత ఉద్యోగాల కోసం పెరుగుతున్న ఆసక్తి
- అనుభవానికి విలువనిస్తూ కొత్త అవకాశాలు కల్పిస్తున్న కంపెనీలు
- సామర్థ్యం ఆధారంగా నియామకాలు జరగాలంటున్న నిపుణులు

భారతదేశంలో జనాభా స్వరూపం వేగంగా మారుతోంది. దేశంలో వృద్ధుల సంఖ్య - మిగతా 2 లో

సుప్రీంకోర్టుకు కేంద్ర హోం సెక్రటరీ బేషరతు క్షమాపణ

- కోర్టు ధిక్కరణ కేసులో అఫిడవిట్ దాఖలు
- రైసీనా హిల్స్ పరిధిలో 24 గంటల పాటు సెల్యులర్ సేవలు నిలిపివేసినట్టు వెల్లడి
- సీఈసీ రాజీనామా కోరుతూ తలపెట్టిన ఆందోళనల నేపథ్యంలో ఈ నిర్ణయం
- ఆందోళనలకు అనుమతి నిరాకరించినట్టు తెలిపిన ఢిల్లీ పోలీస్ కమిషనర్

దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల సందర్భంగా ఇంటర్నెట్ సేవల నిలిపివేతకు సంబంధించి - మిగతా 2 లో

సరస్ మేళా.. ప్రతి ఇంటి నుంచి మహిళా పారిశ్రామికవేత్త రావాలి

- విజయవాడలో జాతీయ సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి, సీఎం
- మహిళాశక్తికి రాష్ట్రపతి ముర్ము స్ఫూర్తిదాయకమన్న చంద్రబాబు
- గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ గుర్తింపు తేవడమే మేళా ఉద్దేశం
- డ్వాక్రా సంఘాలను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే లక్ష్యమని వెల్లడి
- త్వరలో డ్వాక్రా సంఘాల టర్నోవర్ రూ.10 లక్షల కోట్లు కావాలన్న సీఎం

2 లో..

సీఎం రేవంత్ ఆదేశాల అమలు.. విద్యుత్ శాఖలో ఉన్నతాధికారి సస్పెన్షన్

మొదటిపేజీ తరువాయి - జరగడం లేదని అధికారులను ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, టీజీ జెన్‌కో సీఎండీ ఎస్.హరీశ్‌పైనా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండిపోకుండా వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. పంట చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. రానున్న 20 రోజులు పంటలకు కీలకమని, విద్యుత్ కొరత కారణంగా రైతులు నష్టపోయే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని అన్నారు. వ్యవసాయ విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి సరఫరా పెంచాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో లోటు వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్, తాగునీటి సరఫరా పరిస్థితులపైనా సీఎం సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సరఫరా మెరుగుపర్చాలని పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్లక్ష్యాన్ని సహించబోనని, ప్రజలకు తాను జవాబుదారీగా ఉన్నానని స్పష్టం చేశారు.

కరెంట్ కోతలకు మీ వైఫల్యమే కారణం

మొదటిపేజీ తరువాయి - బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అధికారులపై నెపం నెడుతున్నారని ఆరోపించారు. అధికారులు, ప్రజలు కలిసి మీ ఉద్యోగం ఊడగొట్టకుండా చూసుకోవాలంటూ సీఎం రేవంత్‌ను హెచ్చరించారు. రాష్ట్రంలో కరెంట్ కోతలకు, విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీశ్ రావు విమర్శించారు. కనీసం బొగ్గు నిల్వలు సిద్ధం చేసుకోలేదని, విద్యుత్ రంగంపై సరైన సమీక్షలు నిర్వహించలేదని ఆరోపించారు. తొమ్మిది నెలలుగా ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాఖ, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇప్పుడు కోతలు మొదలయ్యాక అధికారులను సస్పెండ్ చేస్తామంటూ బెదిరించడం సరికాదని వ్యాఖ్యానించారు. నిషేధిత భూముల జాబితా వ్యవహారంలోనూ ప్రభుత్వం తప్పును అధికారులపైకి నెట్టిందని హరీశ్ రావు ఆరోపించారు. ఇప్పుడు విద్యుత్ సంక్షోభం విషయంలోనూ అదే పద్ధతిని అనుసరిస్తోందని విమర్శించారు. ఎల్‌నినోను కొవిడ్ లాంటి విపత్తుతో సీఎం పోల్చడంపైనా హరీశ్ రావు స్పందించారు. వీటన్నింటికంటే మీ పాలనే పెద్ద విపత్తు అని ఎందుకు గుర్తించడం లేదంటూ ప్రశ్నించారు. అధికారుల ఉద్యోగాలు తీసేస్తామని హెచ్చరించే ముందు ప్రభుత్వం తన వైఫల్యాలను గుర్తించాలని హితవు పలికారు.

సింగరేణి ప్రైవేటీకరణపై మంత్రి కీలక ప్రకటన

మొదటిపేజీ తరువాయి - రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సంస్థను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని కొట్టిపారేశారు. సింగరేణి భవిష్యత్తుపై కార్మికులు గానీ, ప్రజలు గానీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేళ్ల పాలనలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం సొంత సంస్థలా మార్చుకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సంస్థకు భారీగా బకాయిలు పెట్టి ఆర్థికంగా దెబ్బతీశారని విమర్శించారు. అప్పట్లో సంస్థను నిర్వీర్యం చేసిన నాయకులు, ఇప్పుడు కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. సింగరేణి సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ఆధారాలు లేని విమర్శలను ప్రజలు, కార్మికులు పట్టించుకోవద్దని సూచించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సింగరేణిని కాపాడిందని, ఇప్పుడు కూడా సంస్థ ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడిపిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

గడ్డంతో న్యూ లుక్.. అసలు కారణం చెప్పిన కేటీఆర్

మొదటిపేజీ తరువాయి - వీడియోలు ప్రస్తుతం అంతర్జాలంలో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు దీనిని 'మాస్ లుక్' అంటూ ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. నిన్న రామగుండంలో నిర్వహించిన 'సింగరేణి కార్మిక గర్జన' సభలో పాల్గొనేందుకు కేటీఆర్ హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి బయల్దేరిన సమయంలో ఆయన గడ్డంతో కనిపించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. అనంతరం పర్యటన మార్గమధ్యంలో కరీంనగర్ వద్ద మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సతీశ్ బాబు వంటి నేతలు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా తన గడ్డం వెనుక ఉన్న కారణాన్ని కేటీఆర్ సరదాగా వెల్లడించారు. 'ఏందీ సంగతి.. గడ్డం పెంచినవ్?' అని గంగుల కమలాకర్ అడగ్గా, కేటీఆర్ తనదైన శైలిలో నవ్వుతూ సమాధానమిచ్చారు. "పోయేది గోదావరిఖనికే కదా.. సింగరేణికే కదా! ఆ మాత్రం ఉండాలే.. లేకపోతే నడవదు" అంటూ చమత్కరించారు. సింగరేణి ప్రాంత పర్యటనకు వెళ్తున్నందునే ఈ రకంగా సిద్ధమయ్యానని ఆయన చెప్పడంతో అక్కడున్న వారంతా నవ్వుకున్నారు. కేటీఆర్ కొత్త లుక్ పట్ల ఆయన అభిమానులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఫుల్ జోష్‌లో ఉన్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఆయన ఫొటోలను షేర్ చేస్తూ 'బాస్ ఈజ్ బ్యాక్ విత్ ఏ మాస్ లుక్' వంటి కామెంట్లతో తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు. సాధారణంగా రాజకీయ నాయకులు తమ ఆహార్యం విషయంలో పెద్దగా మార్పులు చేయరు. అయితే, కేటీఆర్ తన లుక్‌ను మార్చడం, దానికి సింగరేణి ప్రాంతాన్ని ముడిపెడుతూ సరదాగా వ్యాఖ్యానించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

నౌకలోని 21 మంది సిబ్బంది సురక్షితంగా గట్టెక్కారు

మొదటిపేజీ తరువాయి - సరుకు రవాణా నౌక సముద్రంలో మునిగిపోయింది. ఈ ప్రమాదం అనంతరం సముద్ర ఉపరితలంపై ఐఫోన్లు, ఖరీదైన పెర్ఫ్యూమ్ బాటిళ్లు తేలియాడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ప్రమాదానికి గురైన నౌక నుంచి చెల్లాచెదురైన లగ్జరీ వస్తువులను సేకరించేందుకు స్థానికులు చిన్న పడవల్లో పోటీ పడుతున్న వీడియోలు వెలుగులోకి వచ్చాయి. దుబాయ్ నుంచి బయలుదేరిన సింగపూర్ పతాకం కలిగిన కంటైనర్ నౌక 'జీఎఫ్ఎస్ ప్రైడ్' బుధవారం ప్రమాదానికి గురైంది. ఏదో గుర్తుతెలియని వస్తువు ఢీకొనడంతో నౌకలో ఒక్కసారిగా మంటలు చెలరేగి, అనంతరం అది నీట మునిగిందని మారిటైమ్ అధికారులు వెల్లడించారు. అయితే, నౌకలోని 21 మంది సిబ్బందిని సురక్షితంగా రక్షించామని, ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం కలగలేదని సింగపూర్ మారిటైమ్ అండ్ పోర్ట్ అథారిటీ ప్రకటించింది. ఈ నౌకలో సుమారు 2,500 కంటైనర్ల నిండా ఐఫోన్లు, ఖరీదైన పెర్ఫ్యూమ్‌లు వంటి విలాసవంతమైన వస్తువులు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) స్పందిస్తూ, సదరు నౌక అనధికార మార్గంలో ప్రయాణిస్తూ సముద్రగర్భంలోని మైన్‌ను ఢీకొట్టడం వల్లే మునిగిపోయిందని పేర్కొంది. అయితే, నౌకపై గుర్తుతెలియని ప్రొజెక్టైల్ దాడి జరిగిందని ఇతర అధికారులు భావిస్తున్నారు. ఈ పరిణామాలతో ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రపంచ చమురు, సహజవాయువు రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులు పెరిగిపోతున్న తరుణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇటీవలే అక్టోబర్ 6న, అమెరికా నౌకలపై నిఘా పెడుతోందని ఆరోపిస్తూ యూఎస్ దళాలు ఒక ఇరాన్ నౌకను ధ్వంసం చేశాయి. అంతకుముందు, సెప్టెంబర్ 23న జరిగిన దాడిలో 'కేప్ డావో' అనే మరో నౌక దెబ్బతిని, మునిగిపోయింది. ఆ ఘటనలో ఒకరు మరణించారు. గత 48 గంటల్లోనే ఈ ప్రాంతంలో డ్రోన్ దాడులతో సహా ఐదు ఘటనలు నమోదయ్యాయని యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ఏజెన్సీ నివేదించింది. ఈ పరిణామాలు జలసంధిలో వాణిజ్య రవాణా భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

సుప్రీంకోర్టుకు కేంద్ర హోం సెక్రటరీ బేషరతు క్షమాపణ

మొదటిపేజీ తరువాయి - దాఖలైన కోర్టు ధిక్కరణ కేసులో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ వ్యవహారంపై కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సుప్రీంకోర్టుకు బేషరతుగా క్షమాపణలు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం అత్యున్నత న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అక్టోబర్ 10న ఢిల్లీలో భారీ నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా అక్టోబర్ 9వ తేదీ రాత్రి 10 గంటల నుంచి అక్టోబర్ 10 రాత్రి 10 గంటల వరకు, అంటే 24 గంటల పాటు రైసినా హిల్స్ పరిసరాల్లోని 4 కిలోమీటర్ల వ్యాసార్థంలో సెల్యులర్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. అయితే, వై-ఫై, బ్రాడ్‌బ్యాండ్ వంటి సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించలేదని హోం సెక్రటరీ తన అఫిడవిట్‌లో స్పష్టం చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా ఢిల్లీ పోలీసులు చేసిన అభ్యర్థన మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. కాగా, నిరసనల సందర్భంగా మెట్రో, రైళ్లు సహా ఇతర అత్యవసర సేవలను పూర్తిగా నిలిపివేయవద్దని సుప్రీంకోర్టు గతంలో ఆదేశాలు జారీ చేసింది. ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం ఈ ఆదేశాలను ఉల్లంఘించడమేనంటూ కోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం, కేంద్ర హోం కార్యదర్శి, ఢిల్లీ పోలీస్ కమిషనర్ సహా ఇతర ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులోనే హోం సెక్రటరీ తాజాగా క్షమాపణలు చెబుతూ అఫిడవిట్ సమర్పించారు. మరోవైపు, ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ సైతం తన అఫిడవిట్‌ను కోర్టుకు సమర్పించారు. జులై 20న జరిగిన నిరసనల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం, నిరసనకారులను నియంత్రించడం కష్టతరంగా మారడం, సామాన్య ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలగడం వంటి కారణాలతో అక్టోబర్ 10న తలపెట్టిన ఆందోళనలకు అనుమతి నిరాకరించినట్లు ఆయన తెలిపారు. ఈ అఫిడవిట్‌లను పరిశీలించిన అనంతరం సుప్రీంకోర్టు తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనుంది.

పాకిస్థాన్‌లో తీవ్ర విషాదం.. స్కూల్ పైకప్పు కూలి 29 మంది మృతి

మొదటిపేజీ తరువాయి - పాకిస్థాన్‌లో గురువారం ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ రాజధాని పెషావర్‌లోని ఒక ప్రైవేట్ పాఠశాల భవనం పైకప్పు కూలిన ఘటనలో 28 మంది చిన్నారులు, ఒక ఉపాధ్యాయురాలు సహా మొత్తం 29 మంది దుర్మరణం పాలయ్యారు. ఈ ప్రమాదంలో మరో 40 మందికి పైగా విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. పెషావర్‌లోని దిర్ కాలనీ ప్రాంతంలో ఈ హృదయవిదారక ఘటన చోటుచేసుకున్నట్లు నగర పోలీస్ చీఫ్ మియాన్ సయీద్ వెల్లడించారు. ఈ ప్రమాదానికి సంబంధించి పాఠశాల యజమానిని ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారు. సమాచారం అందిన వెంటనే సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసే చర్యలు చేపట్టాయి. ఈ దుర్ఘటనలో ఆరుగురు బాలికల సహా 28 మంది విద్యార్థులు, ఒక మహిళా ఉపాధ్యాయురాలు ప్రాణాలు కోల్పోయారని లేడీ రీడింగ్ ఆసుపత్రి ప్రతినిధి మహమ్మద్ అసిమ్ ధ్రువీకరించారు. మరణించిన చిన్నారులందరూ 13 ఏళ్లలోపు వారేనని ఆయన పేర్కొన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితిని ప్రకటించినట్లు వివరించారు. భవనం కూలిన ఘటనపై పెషావర్ డిప్యూటీ కమిషనర్ అఫాక్ వజీర్ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉండవచ్చనే అనుమానంతో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ దారుణ ఘటనపై పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేయడంతో పాటు, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రావిన్స్ గవర్నర్ ఫైజల్ కరీం కుండి కూడా ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

భారత్‌లో పెరుగుతున్న వృద్ధులు.. మారుతున్న ఉద్యోగ సమీకరణాలు

మొదటిపేజీ తరువాయి - గణనీయంగా పెరుగుతుండటంతో, పదవీ విరమణ వయసు తర్వాత కూడా ఉపాధి అవకాశాలపై కొత్తగా చర్చ మొదలైంది. ఐక్యరాజ్యసమితి జనాభా నిధి (యూఎన్ఎఫ్‌పీఏ) విడుదల చేసిన 'ఇండియా ఏజింగ్ రిపోర్ట్' ప్రకారం 2022లో దేశ జనాభాలో 10.5 శాతంగా ఉన్న 60 ఏళ్లు పైబడిన వారి సంఖ్య, 2050 నాటికి 20 శాతానికి పైగా పెరుగుతుందని అంచనా. ఈ పరిణామం సంప్రదాయ పదవీ విరమణ భావనను పునఃసమీక్షించుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతోంది. రిటైర్మెంట్ తర్వాత కూడా పనిచేయడానికి సీనియర్ సిటిజన్లు ఆసక్తి చూపుతున్నారని ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'నేషనల్ కెరీర్ సర్వీస్' పోర్టల్‌లో వృద్ధులకు అనువైనవిగా భావిస్తున్న సుమారు 1.68 లక్షల ఉద్యోగ ఖాళీలు నమోదయ్యాయి. అదే సమయంలో దాదాపు 1.89 లక్షల మంది సీనియర్ సిటిజన్లు ఉద్యోగాల కోసం ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవడం గమనార్హం. ఇది పని చేయడానికి వారిలో ఉన్న ఆసక్తిని, మార్కెట్లో ఉన్న అవకాశాలను సూచిస్తోంది. ప్రభుత్వ వేదికలే కాకుండా 'విజ్డమ్‌సర్కిల్' వంటి ప్రైవేట్ ప్లాట్‌ఫామ్‌లు కూడా అనుభవజ్ఞులైన ప్రొఫెషనల్స్‌ను, రిటైర్ అయిన వారిని కంపెనీలతో అనుసంధానిస్తున్నాయి. కన్సల్టింగ్, మెంటరింగ్, ప్రాజెక్ట్ ఆధారిత పనుల కోసం వీరి నైపుణ్యాలను సంస్థలు ఉపయోగించుకుంటున్నాయి. వయసును కాకుండా వారి అనుభవాన్ని, నైపుణ్యాన్ని గౌరవించే ఫ్లెక్సిబుల్ ఉద్యోగాలకు డిమాండ్ పెరుగుతోందనడానికి ఇది నిదర్శనం. ఇటీవల ముంబైకి చెందిన ఒక స్టార్టప్‌లో 64 ఏళ్ల వ్యక్తి ఇంటర్న్‌గా చేరడం వంటి సంఘటనలు ఈ మార్పును స్పష్టంగా చూపిస్తున్నాయి. అయితే, ఈ మార్పు అంత సులభం కాదు. వయసు పెరిగిన వారు టెక్నాలజీకి అంత తొందరగా అలవాటుపడలేరని, వారికి ఎక్కువ జీతాలు ఇవ్వాల్సి వస్తుందనే కొన్ని అపోహలు నియామకాలకు అడ్డంకిగా మారుతున్నాయి. కానీ, వాస్తవానికి సీనియర్ ఉద్యోగులు తమతో పాటు అపారమైన సంస్థాగత పరిజ్ఞానం, బలమైన వృత్తిపరమైన నెట్‌వర్క్‌లు, సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని తీసుకొస్తారని నిపుణులు విశ్లేషిస్తున్నారు. పనిచేసే కాలాన్ని పొడిగించడం, శ్రామిక శక్తిలో వృద్ధుల భాగస్వామ్యాన్ని పెంచడం, ఫ్లెక్సిబుల్ రోల్స్ కల్పించడం వంటివి దేశ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీనివల్ల పెన్షన్లు, ఆరోగ్య సంరక్షణపై భారం తగ్గడమే కాకుండా, దేశ వృద్ధికి కూడా దోహదపడుతుంది. ఈ నేపథ్యంలో అనేక కంపెనీలు నిరంతర అభ్యాసం, దశలవారీ పదవీ విరమణ, తరం-తరం మధ్య సహకారంతో పనిచేసే బృందాలు వంటి నూతన విధానాలను అన్వేషిస్తున్నాయి. అంతిమంగా వయసును ఒక అడ్డంకిగా చూడకుండా, వారి సామర్థ్యం, అనుభవం ఆధారంగా అవకాశాలు కల్పించే పారదర్శకమైన వ్యవస్థను నిర్మించడమే అసలైన సవాలు.

సరస్ మేళా.. ప్రతి ఇంటి నుంచి మహిళా పారిశ్రామికవేత్త రావాలి

మొదటిపేజీ తరువాయి - విజయవాడలోని పున్నమి ఘాట్‌లో 'జాతీయ సరస్ మేళా' వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి ఈ మేళాను లాంఛనంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా గ్రామీణ మహిళల నైపుణ్యానికి, వారి ఉత్పత్తులకు వేదికగా నిలిచే ఈ కార్యక్రమానికి కనకదుర్గమ్మ సన్నిధి, కృష్ణమ్మ తీరం వేదిక కావడం విశేషం. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ విజయవాడలో ఈ మేళా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఢిల్లీ తర్వాత తొలిసారిగా ఇక్కడ ఏర్పాటు చేసేందుకు అంగీకరించిన రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపారు. పేద కుటుంబంలో పుట్టి, ఎన్నో కష్టాలను ఎదుర్కొని రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన ద్రౌపది ముర్ము జీవితం మహిళలందరికీ ఆదర్శమని కొనియాడారు. మహిళలు సంకల్పిస్తే ఎంతటి ఉన్నత శిఖరాలనైనా అధిరోహించగలరని ముర్ము నిరూపించారని ప్రశంసించారు. మహిళా శక్తిని చాటేందుకే విజయవాడలో ఈ మేళాను ఏర్పాటు చేశామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 650 స్టాళ్లు మహిళల నైపుణ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం, కొత్త వ్యాపార అవకాశాలు సృష్టించడం ఈ మేళా ప్రధాన ఉద్దేశమని వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ ఉత్పత్తులు జాతీయ ఉత్పత్తులుగా మారాలని ఆకాంక్షించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాను ప్రారంభించిన డ్వాక్రా ఉద్యమం నేడు దేశవ్యాప్తంగా ఒక చరిత్ర సృష్టిస్తోందని చంద్రబాబు గుర్తుచేశారు. ప్రస్తుతం డ్వాక్రా సంఘాలు రూ.69 లక్షల కోట్ల రుణాలు తీసుకుంటూ, లక్ష కోట్ల టర్నోవర్‌తో నడుస్తున్నాయని, త్వరలోనే ఇది రూ.10 లక్షల కోట్ల టర్నోవర్‌కు చేరుకోవాలని ఆకాంక్షించారు. స్వయం సహాయక సంఘాలను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. త్వరలోనే పది లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా చూడబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆరు కోట్ల మందిని వ్యాపారవేత్తలుగా మార్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని, ఆయన స్ఫూర్తి ప్రశంసనీయమని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒక మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే తమ ఆశయమని సీఎం స్పష్టం చేశారు.

నైజీరియాలో ఐఎస్ ఉగ్రవాదుల బీభత్సం

మొదటిపేజీ తరువాయి - నైజీరియాలో ఉగ్రవాదులు మరోసారి పెను విధ్వంసం సృష్టించారు. ఈశాన్య నైజీరియాలోని బోర్నో రాష్ట్రంలో ఉన్న ఓ సైనిక స్థావరంపై ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్ ఉగ్రవాదులు మంగళవారం రాత్రి భీకర దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 15 మంది సైనికులు, ఐదుగురు పౌర సేన సభ్యులు (యాంటీ-జిహాదిస్ట్ మిలీషియా) మరణించినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. లేక్ చాద్ ప్రాంతంలోని మైరారీ గ్రామంలో ఉన్న ఈ సైనిక స్థావరాన్ని ఉగ్రవాదులు పూర్తిగా తమ అధీనంలోకి తీసుకున్నారు. ఆయుధాలను దోచుకుని, స్థావరంలో ఉన్న వాహనాలతో సహా అన్నింటికీ నిప్పుపెట్టి బేస్‌ను పూర్తిగా ధ్వంసం చేశారు. ఈ దాడి నుంచి ప్రాణాలతో బయటపడిన సైనికులు సమీపంలోని మోంగునో పట్టణానికి చేరుకున్నారు. మరికొందరు సైనికుల ఆచూకీ గల్లంతవగా, వారిని ఉగ్రవాదులు బంధించి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, రాత్రి 10 గంటల ప్రాంతంలో మొదలైన ఈ దాడి ఉదయం వరకు కొనసాగింది. ఉగ్రవాదులు సైనికులను తరిమికొట్టి, స్థావరంలోని విలువైన వస్తువులన్నింటినీ దోచుకుని, మిగిలిన వాటిని తగలబెట్టారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పొరుగున ఉన్న గుదుంబాలి ప్రాంతం నుంచి ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడినట్లు భావిస్తున్నారు. గత కొన్నేళ్లుగా నైజీరియాలో ఉగ్రవాద హింస విపరీతంగా పెరిగింది. బోకో హరామ్, దాని నుంచి విడిపోయిన ఐఎస్ డబ్ల్యూఏపీ వంటి ఉగ్రవాద సంస్థలు దాడులకు తెగబడుతున్నాయి. 17 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ హింసలో వేలాది మంది ప్రాణాలు కోల్పోగా, సుమారు 20 లక్షల మంది నిరాశ్రయులయ్యారని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. గత మూడు దశాబ్దాలలో ఎన్నడూ లేనంత తీవ్రమైన హింసాత్మక పరిస్థితులు ప్రస్తుతం నైజీరియాలో నెలకొన్నాయని ఏసీఎల్ఈడీ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

అలాంటి వాళ్లను కాల్చి చంపాలి.. ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి - సైనిక చర్య సమయాన్ని మార్చాల్సి వచ్చిందని వెల్లడించారు. ఇలాంటి వారికి జీవితాంతం జైలు శిక్ష విధించాలని కూడా వ్యాఖ్యానించారు. అరిజోనా రాష్ట్రంలోని బుల్‌హెడ్ సిటీలో ఎన్నికల ప్రచార సభలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ అణు కేంద్రాలపై దాడికి ముందు అమెరికా బాంబర్లు బయలుదేరే, చేరుకునే సమయాలు మీడియాకు చేరాయని ఆరోపించారు. ఈ వివరాలు న్యూయార్క్ టైమ్స్, సీఎన్ఎన్‌లో వచ్చినట్లు పేర్కొన్నారు.

దాడి సమయం మార్చాల్సి వచ్చింది!

మిస్సోరీ నుంచి బీ-2 స్టెల్త్ బాంబర్లు బయలుదేరే సమయం బయటకు పొక్కడంతో ఆపరేషన్ ప్రమాదంలో పడిందని ట్రంప్ చెప్పారు. ఈ విషయంపై సీనియర్ సైనికాధికారులతో చర్చించినట్లు తెలిపారు. జనరల్ రజిన్ కేన్‌తో మాట్లాడిన తర్వాత దాడిని వాయిదా వేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అప్పటికే దాడికి సిద్ధమైన పైలట్లు ఈ నిర్ణయంతో నిరాశకు గురయ్యారని చెప్పారు.

రెండు రోజుల తర్వాత దాడి

తొలుత అనుకున్న దాడిని రెండు రోజుల తర్వాత నిర్వహించినట్లు ట్రంప్ తెలిపారు. మొదట లీకైన సమయానికే బాంబర్లను పంపామని, దీంతో ఇరాన్ సైన్యాన్ని ఆశ్చర్యానికి గురిచేయగలిగామని పేర్కొన్నారు. అమెరికా సైనిక చర్యను ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేయకుండా అడ్డుకునే ప్రయత్నంలో భాగంగా అభివర్ణించారు.

అయితే, లీకేజీకి పాల్పడిన వ్యక్తి ఎవరనే విషయాన్ని ట్రంప్ వెల్లడించలేదు. ఆరోపణలకు మద్దతుగా ఆధారాలు చూపలేదు. ఈ వ్యవహారంలో విచారణ ద్వారా ఎవరినైనా గుర్తించారా? అన్నదానిపైనా స్పష్టత ఇవ్వలేదు.

గూఢచర్య చట్టం కింద చర్యలు

అమెరికాలో జాతీయ రక్షణకు సంబంధించిన సమాచారాన్ని అనధికారికంగా బయటపెట్టడంపై కఠిన చట్టాలున్నాయి. అందులో 'ఎస్పియోనేజ్ యాక్ట్' కీలకమైనది. ఈ చట్టం కింద రహస్య సమాచారాన్ని అక్రమంగా భద్రపరచడం, ఇతరులకు చేరవేయడం వంటి చర్యలపై కేసులు నమోదు చేయవచ్చు. ఈ నేపథ్యంలో సైనిక రహస్యాల లీకేజీపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

కేటీఆర్‌ను కలిసిన శేరిలింగంపల్లి ఉద్యమ నాయకులు చిర్రా రవీందర్ యాదవ్

ఇటీవల జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

తిరుమల శ్రీవారి ప్రతిమను అందజేసిన రవీందర్ యాదవ్

శేరిలింగంపల్లి నిలువుటద్దం ప్రతినిధి: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శేరిలింగంపల్లికి చెందిన ఉద్యమ నాయకుడు చిర్రా రవీందర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల జన్మదినం జరుపుకున్న చిర్రా రవీందర్ యాదవ్‌కు కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీలో భాగంగా చిర్రా రవీందర్ యాదవ్ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ప్రతిమను కేటీఆర్‌కు బహూకరించారు. అనంతరం రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న తాజా రాజకీయ పరిణామాలతో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రస్తుత పరిస్థితులు, స్థానిక రాజకీయ అంశాలపై ఇరువురి మధ్య సుదీర్ఘంగా చర్చ జరిగింది. శేరిలింగంపల్లి ప్రాంతంలో రాజకీయంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, స్థానికంగా నెలకొన్న పరిస్థితులు, భవిష్యత్తు రాజకీయ అంశాలపై ఈ సందర్భంగా చర్చించినట్లు సమాచారం. జన్మదినం సందర్భంగా కేటీఆర్ శుభాకాంక్షలు తెలపడంతో చిర్రా రవీందర్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

గీతంలో ఘనంగా దండియా సంబరం!

'శుభారంభ్--2026'లో గర్బా నృత్యాలు.. విద్యార్థుల సందడి

పటాన్ చెరు, నిలువుటద్దం ప్రతినిధి: హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'శుభారంభ్--2026' పేరిట శుక్రవారం దండియా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాకృతి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం గర్బా, దండియా నృత్యాలు, సంగీత కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. సంప్రదాయ వస్త్రధారణలో వేలాది మంది విద్యార్థులు పాల్గొని సందడి చేశారు. ఈ వేడుకలు వివిధ విద్యా విభాగాల విద్యార్థుల మధ్య ఐక్యత, స్నేహభావాన్ని పెంపొందించడంతోపాటు మధుర జ్ఞాపకాలను అందించాయి.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ, పి.జి విద్యార్థుల ట్యూషన్ ఫీజు చెల్లింపునకు చివరి తేది నవంబర్ 7

హైదరాబాద్ అక్టోబర్ 16, 2026: డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2021 నుండి 2025 విద్యా సంవత్సరాలలో డిగ్రీ (బి.ఎ/బి.కాం/బిఎస్సి) ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు సకాలంలో ట్యూషన్ ఫీజు చెల్లించలేకపోయిన వారు నవంబర్ 7 తేది లోపు చెల్లించుకోవచ్చు అని విద్యార్థి సేవల విభాగ డైరెక్టర్ డా.వై. వెంకటేశ్వర్లు ఓ ప్రకటన లో తెలిపారు. అదే విధంగా 2023 నుండి 2025 సంవత్సరాలలో పి.జి (ఎం.ఎ/ ఎం.కాం/ ఎమ్మెస్సీ, ఎం.బి.ఏ), డిప్లొమాలు, సర్టిఫికెట్ కోర్సులలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు కూడా ద్వితీయ సంవత్సరం ట్యూషన్ ఫీజు సకాలంలో చెల్లించలేకపోయిన వాళ్ళు కూడా ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. వివరాల కోసం విశ్వవిద్యాలయ పోర్టల్ : డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు.బిఆర్ఏఓయుఆన్‌లైన్.ఇన్ లో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని అధ్యయన కేంద్రాల్లో లేదా 040-23680 333/ 444/ 555 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

BRAOU U.G & P.G TUITION FEE EXTENDED UPTO NOVEMBER 7

Hyderabad, October 16, 2026: Dr. B. R. Ambedkar Open University has extended the last date for payment of tuition fees for Undergraduate (B.A/B.Com/B.Sc) Second year, Third year from 2021-2025 batchesN P.G (M.A, M.Com, M.Sc and M.B.A) Second year from 2023 to 2025 batches up to November 7, 2026, as a special case. Similarly Diplomas and Certificates programmes students also pay tuition fee through TS/AP Online Centres or cred-it card/debit card. For further details visit nearest study centers or contact at : 040-23680333 / 444 / 555 Or university portal: www.braouonline.in

- Public Relations Officer

కలెక్టరేట్‌లో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబురాలు

టి.ఎన్.జి.ఓ. యూనియన్, అన్ని శాఖల ఉద్యోగుల ఆటపాటలతో సందడిగా మారిన ప్రాంగణం

గౌరమ్మకు పూజలు నిర్వహించి బతుకమ్మ ఆడిన అదనపు కలెక్టర్ సంగీత

సంగారెడ్డి, అక్టోబర్ 16 నిలువుటద్దం ప్రతినిధి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంగారెడ్డి కలెక్టరేట్‌లో అన్ని శాఖల ఉద్యోగులు, తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, సంప్రదాయ ఆటపాటలతో కలెక్టరేట్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంగీత గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి బతుకమ్మ ఆడారు. బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, పూల ప్రాధాన్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ వలయంగా ఏర్పడి సంప్రదాయబద్ధంగా ఆడిపాడారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన బతుకమ్మ పాటలు వేడుకలకు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. పాటలకు అనుగుణంగా మహిళా ఉద్యోగులు నృత్యాలు చేస్తూ సంబరాల్లో పాల్గొన్నారు. విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే ఉద్యోగులు ఒకచోట చేరి పండుగను సామూహికంగా జరుపుకోవడంతో కలెక్టరేట్‌లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా " లలితాదేవి, టి జి ఓ జిల్లా అధ్యక్షులు డా ' వైద్యనాథ్ , జిల్లా టి.ఎన్.జి.ఓ. అధ్యక్షులు,మహిళా నాయకులు, కార్యవర్గం సభ్యులు ,కలెక్టరేట్‌లోని వివిధ శాఖల మహిళా ఉద్యోగులు , సిబ్బంది , సాంస్కృతిక సారథి కళాకారులు, కలెక్టరేట్ సమీప కాలనీ మహిళలు పాల్గొన్నారు.

నందిగామలో గౌడ్ హాస్టల్‌కు కొత్త భవనం

- గౌడ్ హాస్టల్ నూతన భవనం ప్రారంభం
- ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్
- పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, పలువురు నేతలు

పటాన్‌చెరు, నిలువుటద్దం ప్రతినిధి: పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామంలో నూతనంగా నిర్మించిన గౌడ్ హాస్టల్ భవనాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన భవనాన్ని ప్రారంభించారు. భవన ప్రారంభోత్సవం అనంతరం నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథులతో పాటు పలువురు నాయకులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను గౌడ్ హాస్టల్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, టీపీసీసీ టీసీఎఫ్‌సీ చైర్మన్ మోతుకూరి చంద్రశేఖర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, టి. వీరేందర్ గౌడ్, పల్లె రవి, పటాన్‌చెరు మార్కెట్ కమిటీ చైర్మన్ శివానంద, నందిగామ సర్పంచ్ విక్రమ్ గౌడ్, గౌడ్ హాస్టల్ అధ్యక్షుడు చక్రవర్తి గౌడ్, హాస్టల్ భవన స్థలదాత దొంతి లక్ష్మీనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యేలు, బీసీ సంఘాల నాయకులు, గౌడ సంఘాల ప్రతినిధులు, గౌడ్ హాస్టల్ కమిటీ సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో క్రీడలు కీలకం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- అట్టహాసంగా ముగిసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 బాలబాలికల రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు



పటాన్ చెరు, నిలువుటద్దం ప్రతినిధి: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని.. ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గత రెండు రోజులుగా పటాన్ చెరు పట్టణంలోని మైత్రి మైదానం వేదికగా జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అండర్ 17 బాల బాలికల కుస్తీ పోటీలు శుక్రవారం సాయంత్రం ఘనంగా ముగిసాయి. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన క్రీడాకారులు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఉత్కాహభరిత వాతావరణంలో సాగిన ఈ పోటీలు క్రీడాభిమానుల్లో ఆనందోత్సాహాలను నింపాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతోపాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని, విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, ఓటముల నుంచి పాఠాలు నేర్చుకున్నప్పుడే జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడం సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర్ నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మైత్రి క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఎట్టయ్య, పృథ్వీరాజ్, రాజ్ కుమార్, రాము, షకీల్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బతుకమ్మ ప్రకృతి పండుగ ప్రకృతిలో దొరికే గునుగు, తంగేడు, తీరు రుద్రాక్షాలు

బంతి, చామంతి తీరొక్క పూలతో తీరు తీరు బతుకమ్మను పేర్చి అవే పువ్వులను నీటిలో వేసే ప్రకృతి పండుగ ఇది. పర్యావరణాన్ని కాపాడే పండుగ ఈ బతుకమ్మ తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి రేఖాకొ అన్నారు శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా చీఫ్ ప్లానింగ్ ,జిల్లా విద్యాశాఖ, జిల్లా కో-ఆపరేటివ్,ఐ సి డి ఎస్, డి ఐ ఈ ఓ, ఆర్ అండ్ బి, జిల్లా సంక్షేమ శాఖల ఘనంగా బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. తెలంగాణ సాంప్రదాయాలు, సంస్కృతి స్ఫురించేలా బతుకమ్మల అలంకరణ, పాటలు, నృత్యాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది.

తాగునీటి అవసరాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి

ఎల్ నీ నో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరం.

రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి : వాణి ప్రసాద్

పటాన్ చెరు నిలువుటద్దం ప్రతినిధి: ఎల్ నీ నో ప్రభావంతో వర్షపాతం లోటు, భూగర్భ జలాల తగ్గుదల నేపథ్యంలో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర యువజన అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి వాణి ప్రసాద్ అధికారులను శుక్రవారం నాడు ఆదేశించారు. తాగునీటి అవసరాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, నీటి వృధాను అరికట్టడంతో పాటు అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను సూచించారు. ఎల్ ని నో ప్రభావం ఎదుర్కొనేందుకు ప్రభుత్వ శాఖల సమన్వయంతో పాటు ప్రజలు, రైతుల భాగస్వామ్యం అవసరమని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం నాడు గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలో అడిషనల్ కలెక్టర్ టి.యల్. సంగీత తో కలిసి వాణి ప్రసాద్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. పత్తి, కంది, టమాటో పంటలను ఆమె పరిశీలించి పత్తి సాగు చేస్తున్న రైతు బాల్ రెడ్డి తో మాట్లాడి పంటల పరిస్థితి, నీటి లభ్యత, సాగు వివరాలను తెలుసుకున్నారు. తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె సూచించారు. ప్రతి రైతు పొలంలో ఫామ్ పాండు నిర్మించుకునేలా ప్రోత్సహించాలని ఆమె అధికారులను సూచించారు. అనంతరం గుమ్మడిదల తహసీల్దార్ కార్యాలయంలో సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు చెందిన సంబంధిత అధికారులతో వాణి ప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంగారెడ్డి, సిద్దిపేట అడిషనల్ కలెక్టర్లు సంగీత, లక్ష్మీ కిరణ్, వివిధ శాఖల అధికారులు, గుమ్మడిదల తహసీల్దార్ పరమేశం తదితరులు పాల్గొన్నారు.

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో బతుకమ్మ వేడుకలు

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో వేపచాయల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ప్రత్యేక ఆహ్వానితులుగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గారు సృజన గారు పాల్గొన్నారు వేపచాయల బతుకమ్మ వేడుకలు రకరకాల పుష్పలతో అందమైన బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సి.ఎం సి అడిషనల్ కమిషనరులు, అలాగే వివిధ సర్కిల్ల ఉప కమిషనర్లు, అధికారులు పాల్గొనారు, ముఖ్యంగా బతుకమ్మ ఆట పాటలతో సిఎంసి ప్రాంగణమంతా మారుమోగింది సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ గారు సృజన గారు పూల పండుగ సంస్కృతిని,సాంప్రదాయాలను భావితరాలకు అందించవలసినది అని అన్నారు, ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు, ప్రాజెక్టు డైరెక్టర్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు,కమ్యూనిటీ ఆర్గనైజర్లు అలాగే మహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా సౌకర్యాలే లక్ష్యంగా అభివృద్ధి పనుల పరిశీలన.. రూ.1.60 కోట్ల పనులపై సీఎంసీ కమిషనర్ సమీక్ష

కూకట్‌పల్లి, నిలువుటద్దం ప్రతినిధి: కూకట్‌పల్లి పరిధిలో పార్కులు, శ్మశానవాటిక, రహదారుల మధ్యనున్న సెంట్రల్ మీడియన్ అభివృద్ధి పనులను సీఎంసీ కమిషనర్ జి. సృజన ఐఏఎస్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుమారు రూ.1.60 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి, నాణ్యత, నిర్వహణ తీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా కూకట్‌పల్లిలోని డ్రీమ్ వ్యూ కాలనీ పార్కులు, విశ్వంభర పార్కులు, వివేకనగర్ శ్మశానవాటికతో పాటు కేపీహెచ్‌బీ ఐదో ఫేజ్ సెంట్రల్ మీడియన్‌ను ఆమె సందర్శించారు. అక్కడ చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పార్కుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, ఇతర మౌలిక వసతులపై వివరాలు తెలుసుకున్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పార్కులు, ప్రజా వినియోగ ప్రాంతాల పరిశుభ్రత, ఆహ్లాదకరంగా ఉండేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులు ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా ఉండాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బతుకమ్మ సంబరాలు

హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం సాయంత్రము బతుకమ్మ పండుగ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వారు పాల్గొని తెలంగాణ సాంప్రదాయమ్మ పండుగను ఉద్యర్యంలో మహిళలు కుటుంబ సభ్యులతో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని, అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలతోపాటు కుటుంబ సభ్యులందరికీ కలగాలని వారికి శక్తి, ధైర్యాన్ని అమ్మవారి ప్రసాదించాలని కోరుతూ ఈ పండుగను జ్యోతి ప్రజలతో ప్రారంభించి బతుకమ్మను ఆటపాటలతో వారు మహిళలతో కలిసి బతుకమ్మ ఆటపాటలు ఆడారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ కలిసి సంబంధించిన మహిళలు కుటుంబ సభ్యులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రతీక్ దంపతులు, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్.

సంగారెడ్డి ,అక్టోబర్ 16 నిలువుటద్దం ప్రతినిధి : జిల్లా పోలీసు కార్యాలయంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై సందడి చేశారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో జిల్లా పోలీసు కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ ప్రకృతి అందాలు, ఆచార సంప్రదాయాలు ఉట్టిపడేలా వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ ఆటపాటలతో వేడుకలను జరుపుకున్నారు. సంప్రదాయ పాటలు, కోలాటాలు, ఆటపాటలతో పోలీసు కుటుంబ సభ్యుల సందడి మధ్య వేడుకలు అంబరాన్నంటాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు, పోలీసు కుటుంబాల మధ్య ఆత్మీయత, ఐక్యతను పెంపొందించేలా ఈ వేడుకలు నిర్వహించారు. కుటుంబసభ్యులందరూ ఒకచోట చేరి ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగను జరుపుకోవడం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి, సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

నిలువుటద్దం

శనివారం 17-10-2026

వర్షాలు సమృద్ధిగా కురవాలి.. పాడిపంటలతో తెలంగాణ సుభిక్షంగా వర్ధిల్లాలి!

ఎల్లమ్మబండ ఈద్గా వద్ద ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్థనలు

ప్రార్థనల్లో పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్.......

శేరిలింగంపల్లి, అక్టోబర్ 16 (నిలువుటద్దం ప్రతినిధి): వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు కళకళలాడి, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి ప్రార్థనల్లో పాల్గొని, సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలకు మేలు జరగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సమయానికి వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండి, భూగర్భ జలాలు పెరిగి, వ్యవసాయానికి అవసరమైన నీరు సమృద్ధిగా అందాలని ఆకాంక్షించారు. ప్రజా శ్రేయస్సును కాంక్షిస్తూ ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, రైతుల కష్టాలు తొలగి వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని వరుణదేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా మారాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం వంటి అంశాల నేపథ్యంలో వర్షపాతం పరిస్థితులపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని పేర్కొంటూ, ప్రకృతి అనుకూలించి సమృద్ధిగా వర్షాలు కురవాలని భగవంతుడిని ప్రార్థించినట్లు గాంధీ తెలిపారు. అల్లా దయతో అందరికీ మంచి జరగాలని, ప్రజల జీవితాల్లో సంతోషం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. మతాలకు అతీతంగా ప్రజా సంక్షేమమే లక్ష్యం ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, ప్రకృతి సమతుల్యత కోసం అన్ని వర్గాల ప్రజలు ఐకమత్యంతో ప్రార్థించడం సమాజంలో సోదరభావాన్ని పెంపొందిస్తుందని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు. వర్షాలు సమృద్ధిగా కురిసి జలవనరులు నిండి, రైతులకు మేలు జరిగి, ప్రజలందరికీ తాగునీటి సమస్యలు తొలగిపోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. తాజా సమాచారంతో వార్తను కుదించండి పునరావృత వాక్యాలను తొలగించండి అనవసర వాతావరణ అంచనాలను తొలగించండ

మద్దతుదారుల మెప్పు కోసమే మోదీ వాగాడంబరం



ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రధాని మోదీ ఉపయోగిస్తున్న భాష చాలా మందిని దిగ్భ్రాంతికి గురిచేస్తున్నది. ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌పై విజయం సాధించినట్టు భారత్ ప్రకటించింది. ఆ తర్వాత మోదీ ఆ కీర్తికాంతుల్లో దర్జాగా ఓలలాడాలి. కానీ, అలా జరగడం లేదు. అందుకు విరుద్ధంగా రోజు విడిచి రోజు పాకిస్థాన్‌పై భారత్ కఠిన వైఖరి గురించి గుండెలు బాదుకుంటూ ఆవేశపూరిత ప్రసంగాలు ఎందుకు చేస్తున్నట్టు? మోదీ ఉపయోగిస్తున్న వైవిధ్యభరితమైన భాష అనాలోచితమైందిగా భావించడానికి వీల్లేదు. 32 దేశాలకు ఏడు అఖిలపక్ష ప్రతినిధివర్గాలతో దౌత్య రాయబారాలు పంపించిన తర్వాత అం దుకు భిన్నంగా ఈ ఆవేశకావేశాలు ఏమిటా? అని విస్మయం కలుగుతున్నది. మోదీ దూకుడు ను ప్రపంచ నేతలు సానుకూలంగా తీసుకోరు. అదేవిధంగా జైషే మహమ్మద్, లష్కరే తోయి బా వంటి ఉగ్రవాద సంస్థలకు ఆశ్రయం ఇవ్వ డం ద్వారా భారత్‌పై పాక్ యుద్ధం జరుపుతున్నదనే సందేశానికి తోడ్పాటునూ అందించరు. మోదీ వాగాడంబరం స్థానిక ఒత్తిళ్లతో స్వదేశీ ప్రజల కోసం ఉద్దేశించినట్టుగా కనిపిస్తున్నది. ఇంతకూ ఏమిటవి? టీవీలకు, పత్రికలకు పతా క శీర్షికలు సమకూర్చాలనే దుగ్ధ కారణమా? ఆయన ఉపయోగిస్తున్న సినీ ఫక్కీ డైలాగుల కొత్తదనం పదేపదే ఉపయోగించే రొడ్డకొట్టుడు ప్రసంగాలు చేసే రాజకీయ నాయకుల కంటే మోదీని భిన్నంగా నిలబెడుతున్నది. ప్రతి ప్రసంగంలో ఆయన కథనాన్ని మార్చి మీడియాకు రోజుకో పతాక శీర్షికను సమకూరుస్తున్నారు. కీలకమైన బీహార్ ఎన్నికల్లో బీజేపీని ఏకైక అతిపెద్ద పార్టీగా గెలిపించాలన్న ఉద్దేశంతో మోదీ అలా మాట్లాడుతున్నారనేది మరో వివరణ. కీలకం ఎందుకంటే, జనతాదళ్ (యునైటెడ్) నేత నితీశ్‌కుమార్‌కు రాష్ట్రానికి మరో విడత సారథ్యం వహించే శారీరక, మానసిక క్షమత ఎంతమాత్రం లేనట్టుగా కనిపిస్తుండటం. ఏదేమైనప్పటికీ, బీహార్ ఎన్నికలు మాత్రం కుల సమీకరణాల ఆధారంగా జరుగుతాయి. కాబట్టి, మోదీ చేస్తున్న గుండెలు బాదుకునే ప్రసంగాలు ప్రధానంగా బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేస్తున్నవి కాకపోవచ్చు. పాకిస్థాన్‌పై సైనిక చర్య ప్రారంభించిన భారత్.. పీవోకేను చేజిక్కించుకోలేదని మితవాదవర్గాలు అసంతృప్తితో ఉన్నాయి. భారత రక్ష ణ దళాలు విజయం సాధిస్తున్నాయని, పాక్ రక్షణ వ్యవస్థలను బద్దలు కొడుతున్నాయని మే 7-10 వరకు మీడియా సమావేశాల్లో ప్రభు త్వం చెప్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో హఠాత్తు గా కాల్పుల విరమణకు అంగీకరించడం వారిని విస్మయానికి గురిచేసింది. కాల్పుల విరమణ అనేది పాకిస్థాన్ బెదిరిపోయి అడిగినందుకా లేక ట్రంప్ బెదిరింపులు, వాణిజ్య ప్రోత్సాహకాల కోసమా? అనే వివరణలతో వారికి నిమిత్తం లేదు. ఉన్నపళంగా యుద్ధాన్ని ఆపివేయడం వారికి నచ్చలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సైనిక, రాజకీయ వ్యూహం గురించి తన మద్దతుదారులను ఒప్పించేందుకు తగిన బహిరంగ వైఖరిని మోదీ రూపొందించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. సైనిక చర్య కొనసాగుతుందని ఆయన ఇస్తున్న హామీ రెండు దేశాల మధ్య శత్రుత్వాన్ని, ఉద్రిక్తతలను పెంచుతుంది. ఆయన మద్దతుదారులు కోరుకునేది అదే. అందుకే 'సిందూర్'కు ఇప్పటికీ కొనసాగుతున్న మిలిటరీ ఆపరేషన్‌గానే ముద్రవేస్తున్నారు. చర్య కొనసాగుతున్నదని, దీర్ఘకాలిక యుద్ధం జరుగుతున్నదని భరోసా ఇస్తే మద్దతుదారుల్లో మోదీ తరహా దుందుడుకు నాయకత్వ శైలికి ప్రాసంగికత, ఆవశ్యకత ఉన్నాయన్న నమ్మకం ఏర్పడుతుంది. పార్లమెంటులో గుచ్చిగుచ్చి అడిగే ప్రశ్నలను తప్పించుకునేందుకు 'కొనసాగుతున్న ఆపరేషన్' వెనుక దాక్కునేందుకు వీలు కలుగుతుంది. మితవాద మద్దతుదారుల వంటి వారి నుంచి వచ్చే స్వదేశీ ఒత్తిళ్లు రెండు దేశాల మధ్య మరో విడత సైనిక ఘర్షణకు దారితీస్తుందా? అనేది ఇక్కడ అసలు ప్రశ్న. ఈ నేపథ్యంలో ఈ దుందుడుకు మాటలు ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చి, శత్రుత్వాన్ని పెంచి, ఉద్రిక్తతలకు ఆజ్యం పోయకుండా చూడాల్సి ఉంది. ఎందుకంటే పహల్గాం పాకిస్థాన్‌లో లేదు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

ఆడపడుచులకు పండుగ కానుకగా చీరల పంపిణీ!

మహిళా నాయకురాళ్లకు సారెగా చీరల అందజేత.. దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు

బతుకమ్మ, దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు -- దొడ్ల వెంకటేష్ గౌడ్........

శేరిలింగంపల్లి నిలువుటద్దం ప్రతినిధి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ, దసరా పర్వదినాలను పురస్కరించుకుని ఆల్విన్ కాలనీ, శంషిగూడ డివిజన్ల పరిధిలోని ఆడపడుచులు పండుగలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలనే ఉద్దేశంతో డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో మహిళా నాయకురాళ్లకు చీరలను పంపిణీ చేశారు. యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ చేతుల మీదుగా మహిళా నాయకురాళ్లకు సారెగా చీరలను అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల జీవన విధానంలో బతుకమ్మ పండుగకు ప్రత్యేక స్థానం ఉందని, ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ, మహిళలు ఐకమత్యంతో జరుపుకునే ఈ పండుగ మన రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. మహిళల భాగస్వామ్యంతో నిర్వహించే బతుకమ్మ ఉత్సవాలు కుటుంబాల్లో ఆనందాన్ని నింపడమే కాకుండా, సమాజంలో సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా దొడ్ల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను గౌరవిస్తూ, మహిళా నాయకురాళ్లు బతుకమ్మ, దసరా పండుగలను సంతోషంగా జరుపుకోవాలనే ప్రధాన ఉద్దేశంతో చీరలను సారెగా అందజేసినట్లు తెలిపారు. పండుగల సమయంలో మహిళల్లో ఆనందాన్ని పంచుకోవడం, వారి ఆత్మీయతను గౌరవించడం, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచులకు ఎంతో ప్రత్యేకమైనదని, పూలను అందంగా పేర్చి బతుకమ్మను తయారు చేయడం, సంప్రదాయ పాటలు పాడుతూ బతుకమ్మ చుట్టూ ఆడిపాడటం, సామూహికంగా వేడుకలు నిర్వహించడం మన సంస్కృతిలో అంతర్భాగమని వివరించారు. ఈ పండుగ ద్వారా మహిళల మధ్య ఆత్మీయత, పరస్పర సహకారం, ఐకమత్యం మరింత బలపడతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

బతుకమ్మ, దసరా వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు

ఆల్విన్ కాలనీ, శంషిగూడ డివిజన్ల పరిధిలో బతుకమ్మ, దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు దొడ్ల వెంకటేష్ గౌడ్ తెలిపారు. డివిజన్ పరిధిలోని అంబిర్ చెరువు కట్టపై, శివమ్మ కాలనీలోని రామాలయం వద్ద మహిళలు, స్థానిక ప్రజలు సౌకర్యవంతంగా ఉత్సవాల్లో పాల్గొనేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించుకునేందుకు అనుకూలమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ఉత్సవాలకు హాజరయ్యే ఆడపడుచులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బతుకమ్మ వేడుకలు కేవలం పండుగలకే పరిమితం కాకుండా తెలంగాణ అస్తిత్వాన్ని, మహిళల ఆత్మగౌరవాన్ని, మన సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పే వేదికలుగా నిలవాలని ఆకాంక్షించారు.

ఐకమత్యంతో పండుగలను ఘనంగా జరుపుకుందాం

ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా బతుకమ్మ, దసరా ఉత్సవాలను పెద్దఎత్తున నిర్వహించేందుకు డివిజన్ల పరిధిలోని ప్రజలు, మహిళా నాయకురాళ్లు, యువత, స్థానిక కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు తమ సహకారం అందించాలని దొడ్ల వెంకటేష్ గౌడ్ కోరారు. పండుగలు ప్రజలందరినీ ఒకచోట చేర్చి, ప్రేమాభిమానాలను పంచే సందర్భాలని, ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవంతో, సోదరభావంతో వేడుకల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సంప్రదాయాలను కాపాడుతూ, బతుకమ్మ పండుగ వైభవాన్ని భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. మహిళలు, యువత, పెద్దలు సమష్టిగా పాల్గొంటే ఉత్సవాలు మరింత వైభవంగా జరుగుతాయని పేర్కొన్నారు. చివరగా, దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ఆల్విన్ కాలనీ, శంషిగూడ డివిజన్ల ప్రజలకు, తెలంగాణ ఆడపడుచులందరికీ బతుకమ్మ, విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతిని కాపాడుకుందాం.. బతుకమ్మ పండుగ వైభవాన్ని చాటుదాం.. ఐకమత్యంతో ఆనందంగా దసరాను జరుపుకుందాం!

హైకోర్టు సర్వే ఆర్డర్లున్నా ఆగని నిర్మాణాలు

-కట్టడాలు ఆపాలంటూ హైడ్రాకు విన్నపాలు

-హైడ్రా ప్రజావాణికి 56 ఫిర్యాదులు

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం ఇంజాపూర్ విలేజ్ సర్వే నంబరు 126లో 74.16 ఎకరాలప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని కాపాడాలంటూ రెవెన్యూ అధికారులకు లేఖలు రాయడమే కాదు.. హైకోర్టుకు కూడా అక్కడి స్థానికులు ఆశ్రయించారు. మొత్తం సర్వే చేసి ఆ భూమి వివరాలు తెలపాలని రెవెన్యూ అధికారులను హైకోర్టు ఆదేశించింది. సర్వే జరగదు.. నిర్మాణాలు ఆగవు అనేట్టు అక్కడ కబ్జాలు జరుగుతున్నాయని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో వాపోయారు. పెద్ద గోదాములు నిర్మించి భూమిని తమ ఆధీనంలోకి కబ్జాదారులు తీసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. హైకోర్టు ఆర్డర్ ప్రకారం సర్వే చేసి.. ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తుర్కయాంజల్ తొర్రూరు డివిజన్ ఇంజాపూర్ విలేజ్‌లోని పార్కుకోసం కేటాయించిన 1200ల గజాల స్థలాన్ని ప్లాట్లుగా చేసి విక్రయించేస్తున్నారని అక్కడి స్థానికులు పిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం కుంట్లూరులోని జయప్రకాష్‌నగర్ మంజీరా కాలనీలో కూడా 577 గజాల పార్కును కబ్జా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 56 ఫిర్యాదులందాయి. వీటిని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు పరిశీలించి.. వెనువెంటనే పరిష్కరించాలని హైడ్రా అధికారులను ఆదేశించారు.

ఫిర్యాదులు ఇలా..

కూకట్‌పల్లి నల్ల చెరువును హైడ్రా ఎంతో బాగా అభివృద్ధి చేసింది. 5 మీటర్ల మేర పేరుకుపోయిన పూడిక వల్ల గతంలో ఈ చెరువులోని నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి ఉండేది కాదని.. హైడ్రా అభివృద్ధి చేసిన తర్వాత పరిసరాల్లో భూగర్భ జలాలు పెరిగాయని స్థానికులు ప్రజావాణిలో చెప్పారు. అయితే ఆ ఫలాలు స్థానిక నివాసితులకు దక్కనీయడంలేదని.. బోర్లతో తోడేసి నీటి వ్యాపారులు చేస్తున్నారని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చెరువు పరిసరాల్లో బోర్లు వేసి నీటిని పెద్దమొత్తంలో తోడి వాణిజ్య అవసరాలకు అమ్మేసుకుంటున్నారని స్థానికులు ఫొటోలు, వీడియోలతో సహా ఫిర్యాదు చేశారు. హయత్‌నగర్ మండలం.. నాగోలు నుంచి కుంట్లూరు వెళ్లే దారిలో నాలాతో పాటు.. ఆ పక్కనే ఉన్న 300ల గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని.. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని అక్కడి నివాసితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. నాలాను ఆక్రమించి ఇటీవలనే నిర్మించిన రెండు గదులను తొలగించి వరద ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని కోరారు. హయత్‌నగర్ మండలం సాహేబ్‌నగర్ కలాన్ విలేజ్‌లోని 7.34 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురౌతోందని ఫిర్యాదు చేశారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం దేవరయాంజల్ విలేజ్‌లోని కోమటికుంట ఫుల్ ట్యాంక్ పరిధిలో నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. అ పక్కనే ఉన్న సర్వే నంబరు 63లో ప్రభుత్వ భూమితో పాటు.. ఎండోమెంట్ ల్యాండ్ ఉందని అందులో జరుగుతున్న నిర్మాణాలను ఆపాలని కోరారు. అలాగే గండిమైసమ్మ దుండిగల్ మండలం బహదూర్‌పల్లి విలేజ్ సర్వే నంబరు 131/1లఓ 20 గుంటల ప్రభుత్వ భూమి కబ్జాకు గురౌతోందని ప్రజావాణి ఫిర్యాదులో పేర్కొన్నారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కౌకూరు - యాప్రాల్ చెరువునలు కలిపే వరద కాలువ కబ్జాలకు గురౌతోందని.. అక్కడ వెంచర్లు వేసినవవారు కబ్జాలకు పాల్పడుతున్నారని.. దీంతో వరద ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని వెన్‌రాగ్ ఎన్‌క్లేవ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిర్యాదు చేసింది. ఇదే ప్రాంతంలోని వంజరబస్తీలోని రహదారి కబ్జాకు గురౌతోందని.. ఫిర్యాదు అందింది. ఆర్.కె.పురం చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా పేర్కొంటారని.. ఆ చెరువు కబ్జాలకు గురౌతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో పిగ్ శ్లాటర్‌హౌస్ నిర్మించి వ్యర్థాలను చెరువులోకి వదులుతున్నారని.. ఇలా దాదాపు 2 ఎకరాల వరకూ కబ్జా చేశారంటూ అక్కడి స్థానికులు ఫిర్యాదులో పేర్కొన్నారు. కవాడిగూడ గాంధీనగర్‌లోని ఘంటసాల ప్లే గ్రౌండ్ దాదాపు ఎకరం వరకూ ఉంటుంది. ఇక్కడ అధికారికంగా ప్లే ఏరియాగా నిర్ణయించారు. ఇదే ప్లేగ్రౌండ్‌లో షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం కూడా ఉంది. బయట వాలిబాల్ కోర్టులున్నాయి. ఇక్కడి నుంచి జాతీయ స్థాయి క్రీడాకారులు అనేకమంది తయారయ్యారు. ఇలాంటి స్టేడియాన్ని కూరగాయల మార్కెట్ చేసేశారని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వారాంతపు సంతలు ఇక్కడ పెట్టి క్రీడలకు ఆస్కారం లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రీడాప్రాంగణాన్ని కాపాడాలని హైడ్రా ప్రజావాణిలో స్థానికులు కోరారు.

75 గంటల పాటు నిరంతర డప్పు వాయిద్యం.. బీజేపీ ఎస్సీ మోర్చా ప్రపంచ రికార్డు!

ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్'లో అరుదైన ఘనత

2,000 మంది డప్పు కళాకారులతో 75 గంటలపాటు నిర్విరామ ప్రదర్శన

ప్రపంచ రికార్డును ప్రధాని నరేంద్ర మోదీకి అంకితం చేసిన ఆంధ్రప్రదేశ్ ఎస్సీ మోర్చా.........

హైదరాబాద్, అక్టోబర్ 16 (నిలువుటద్దం ప్రతినిధి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన 'సేవా సంకల్ప్ అభియాన్', 'సేవా ప్రతిజ్ఞ' కార్యక్రమాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో అరుదైన ఘనత నమోదైంది. సంప్రదాయ డప్పు కళకు ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకురావాలనే సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,000 మంది డప్పు కళాకారులు షిఫ్టుల వారీగా పాల్గొని, 75 గంటలపాటు నిరంతరాయంగా డప్పులు వాయించారు. ఈ వినూత్న ప్రదర్శన ప్రపంచ రికార్డుగా నమోదైందని నిర్వాహకులు ప్రకటించారు. ఈ విజయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అంకితం చేశారు. దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువ కావడం, సామాజిక సేవా భావాన్ని పెంపొందించడం, సంప్రదాయ కళలను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ అభియాన్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఎస్సీ మోర్చా చేపట్టిన 75 గంటల డప్పు వాయిద్య కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తరతరాలుగా కొనసాగుతున్న డప్పు కళకు విశేష ప్రాచుర్యం కల్పించడంతోపాటు కళాకారుల ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పే ప్రయత్నంగా ఈ కార్యక్రమం నిలిచింది.

75 గంటల నిర్విరామ ప్రదర్శన.. కళాకారుల సమష్టి కృషికి నిదర్శనం

ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పనతల సురేష్ నాయకత్వం వహించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి అవసరమైన ఏర్పాట్లు, సమన్వయం, అమలు బాధ్యతలను నిర్వాహకులు సమర్థంగా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ మోర్చా కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తమ వంతు సహకారం అందించారు. సుమారు 2,000 మంది డప్పు కళాకారులు వివిధ షిఫ్టుల్లో పాల్గొంటూ 75 గంటలపాటు నిరంతరంగా డప్పులు వాయించడం ఈ కార్యక్రమంలోని ప్రధాన విశేషం. వ్యక్తిగత ప్రతిభతోపాటు బృంద సమన్వయం, క్రమశిక్షణ, పట్టుదల, సంప్రదాయ కళపై ఉన్న మక్కువ ఈ అరుదైన ప్రదర్శనకు బలాన్నిచ్చాయి. ఇంత పెద్ద సంఖ్యలో కళాకారులు ఒకే లక్ష్యంతో ముందుకు సాగడం నిర్వాహకుల్లోనూ, కళాభిమానుల్లోనూ ఉత్సాహాన్ని నింపింది.

తంబళ్లపల్లె కళాకారుల కీలక పాత్ర

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన సుమారు 300 మంది డప్పు కళాకారులు ఈ ప్రపంచ రికార్డు ప్రదర్శనలో కీలక పాత్ర పోషించారు. రాష్ట్ర ప్రతినిధి పీట్ల అంజలి సమన్వయంతో ఈ కళాకారులు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. తమ సంప్రదాయ కళను పెద్ద వేదికపై ప్రదర్శించే అవకాశం లభించడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పనతల సురేష్‌కు కళాకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించడం తమకు గర్వకారణమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని కళాకారులకు ప్రోత్సాహం లభిస్తే వారి ప్రతిభ మరింత విస్తృతంగా వెలుగులోకి వస్తుందని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది.

ప్రపంచ రికార్డును ధ్రువీకరించిన వరల్డ్ రికార్డ్స్ ఇండియా

ఈ కార్యక్రమాన్ని వరల్డ్ రికార్డ్స్ ఇండియా సీఈఓ పవన్ సోలంకి స్వయంగా పరిశీలించారు. 75 గంటలపాటు కొనసాగిన డప్పు వాయిద్య ప్రదర్శనను పరిశీలించిన అనంతరం ప్రపంచ రికార్డు నమోదైనట్లు అధికారికంగా ప్రకటించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రకటనతో కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు, నాయకులు, నిర్వాహకుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. సంప్రదాయ డప్పు కళను ప్రపంచస్థాయిలో నిలబెట్టే దిశగా ఈ ప్రదర్శన ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. కళాకారుల శ్రమకు గుర్తింపు లభించడంతోపాటు, తెలుగు రాష్ట్రాల సంప్రదాయ కళా వైభవాన్ని మరింత విస్తృతంగా పరిచయం చేసే అవకాశాన్ని ఈ కార్యక్రమం కల్పించింది.

పలువురు ప్రముఖుల హాజరు

ఈ కార్యక్రమంలో సినీనటుడు, మాజీ మంత్రి బాబుమోహన్, బీజేపీ జాతీయ కో-కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జాతీయ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు శివేష్ కుమార్ రామ్, టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోల ఆనంద్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ నాయకుడు, ఎమ్మెల్యే కె. చార్వామలయ్య ప్రసాద్‌తో పాటు పలువురు నాయకులు కార్యక్రమానికి హాజరై కళాకారులను అభినందించారు. రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ గాలి పుష్పలత, తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, వివిధ రాష్ట్రస్థాయి పదాధికారులు, ఎస్సీ మోర్చా జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమష్టి కృషిని అభినందించిన మంత్రి సత్యకుమార్ యాదవ్

గూగుల్ మీట్ ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రపంచ రికార్డు సాధనకు కృషి చేసిన రాష్ట్ర ఎస్సీ మోర్చా నాయకులు, కమిటీ సభ్యులు, డప్పు కళాకారులను అభినందించారు. ఇంత పెద్ద కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయడం సమిష్టి కృషికి నిదర్శనమని ప్రశంసించారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమం, సంప్రదాయ కళలకు ప్రోత్సాహం అందించడం ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందింది. 75 గంటలపాటు నిరంతరంగా డప్పులు వాయించి ప్రపంచ రికార్డు సాధించిన కళాకారుల కృషి, పట్టుదల, అంకితభావం ఈ కార్యక్రమానికి ప్రధాన బలంగా నిలిచాయి. సేవా భావం, సామాజిక భాగస్వామ్యం, కళా వైభవం కలిసిన ఈ ప్రదర్శన ఆంధ్రప్రదేశ్ ఎస్సీ మోర్చాకు చిరస్మరణీయ విజయంగా నిలిచింది.

Printed, Published and owned by Y. Ramadevi on behalf of NAGAPUBLICATIONS and printed of Koushik Printers, Vidya Nagar, Hyderabad
Published.... 3/5, MIG Flats, KPHB, Hyderabad 500072, Editor Y. Nagaraju, Ph. No. 9059548848 RNI:APTEL/2001/14027